క్లుప్తంగా

మంత్రి తుమ్మలకు వినతి



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

నడిగూడెం : ఇంటర్మీడియట్‌లో వృత్తివిద్యా కోర్సు అయిన క్రాప్ ప్రొడక్షన్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు వ్యవసాయ శాఖలో ఏఈఓల భర్తీలో అవకాశం కల్పించాలని కోరుతూ ఆదివారం మండలానికి చెందిన పలువురు విద్యార్థులు ఖమ్మంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు ఇచ్చిందని, మళ్లీ అదే జీఓల ప్రకారం ఏఈఓల భర్తీలో అవకాశం కల్పించాలని మంత్రికి వివరించారు. ఆయనను కలిసిన వారిలో కాసాని గోపీనాథ్, రియాజ్ తదితరులున్నారు.

విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

మునగాల : మండలంలో మార్చి 3న నిర్వహించే బీజేపీ విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు బొలిశెట్టి కృష్ణయ్య, పార్టీ మండల అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో జిల్లా నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య, నల్లగొండ నియోజకవర్గ నాయకులు సతీష్, స్థానిక నాయకులు కార్తీక్, గోపి, మధు పాల్గొన్నారు.

ఆలయంలో సివిల్ జడ్జి పూజలు



జడ్జి దంపతులను సన్మానిస్తున్న ఆలయ ఈఓ కొండారెడ్డి

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని ఫణిగిరి గుట్టుపై గల శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఆదివారం హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌కుమార్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయానికి వచ్చిన జడ్జి దంపతులను ఆలయ ఈఓ కొండారెడ్డిని సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

అనంతగిరి : మండల కేంద్రంలో మల్టీపర్పస్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేగ హనుమంతు, ఉపాధ్యక్షుడిగా పద్మ, కార్యదర్శిగా తమలపాకుల విజయ్, సహాయ కార్యదర్శిగా గుండు సురేష్ ఎన్నుకున్నారు.

చర్చిలో కొత్తకాలపు పండుగ



శానమ్‌రాజు దంపతులను సన్మానిస్తున్న క్రైస్తవులు

నడిగూడెం : మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం కొత్తకాలపు పండును ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలో కోదాడ సీఎస్ఐ సంస్థ గ్రూపు చైర్మన్ శానమ్ రాజు పాల్గొని బైబిల్ సందేశాన్ని బోధించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శానమ్‌రాజు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక పాస్టర్ సుధాకర్, స్వరూపరాణి, కలకొండ సృజన్, క్రైస్తవులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : పట్టణంలోని అంజలీస్కూల్ ప్రాంతంలో విద్యుత్ లేన్ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఏఈ పందిరి శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి 6గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, అదే విధంగా తెలగరామయ్యగూడెం 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు ఉన్నందున ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు తెలిపారు.

గంజాయి మత్తుతో యువత చిత్తు

- కోదాడలో విచ్చలవిడిగా క్రయవిక్రయాలు
- పట్టణ శివారు ప్రాంతాలే అడ్డాగా మార్చుకుని తాగుతున్న యువత
- రెండు రోజుల క్రితం పట్టుబడిన ఆరుగురు యువకులు
- సరిహద్దులో నిఘా లేకపోవడంతో ఆగని ఆగడాలు



గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన యువకులతో కోదాడ ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

కోదాడరూరల్ : ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేయాల్సిన యువత గంజాయి, డ్రగ్స్ బారిన పడి మత్తుతో చిత్తవుతున్నారు. గంజాయి ఎక్కువగా 15ఏళ్ల నుంచి 30ఏళ్ల వయస్సు గల విద్యార్థులు, యువకులే తీసుకోవడంతో పాటు క్రయవిక్రయాలకు పాల్పడుతున్నారు. మాదకద్రవ్యాలను పూర్తిగా రూపుమాపేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎం చెప్పినా వాటిని నిర్మూలించడంలో సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లు ఉంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఉన్న కోదాడ పట్టణంలో గంజాయి విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతుండడంతో అనేక మంది యువత దానికి బానిసలు అవుతున్నారు. వారు శివారు ప్రాంతాలను అడ్డాగా చేసుకొని తాగుతూ మత్తులో మునిగితేలుతున్నారు. రెండు రోజుల కిందట కోదాడ శివారు ప్రాంతంలో గంజాయి తాగుతూ ముగ్గురు యువకులు పట్టుపడగా వారికి అదుపులోకి తీసుకొని విచారించగా వారు చెప్పిన సమాచారం మేరకు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని 620గ్రాముల గంజాయిని కూడ స్వాధీనం చేసుకున్నారు. యువకులు గంజాయికి బానిసై వారు పెడుతున్న ఇబ్బందులను తల్లిదండ్రులు బయటకు చెప్పుకోలే కుమిలిపోతున్నారు. ఇటీవల గంజాయి రవాణా చేస్తు పట్టుబడిన వారిలో ఓ ప్రభుత్వ ఉద్యోగి కుమారుడు కూడా ఉన్నట్లు తెలుస్తుంది. ఏడాదిన్నర కిందట గంజాయికి బానిసైన కుమారిడిని కట్టడి చేసేందుకు ఓ గదిలో బలవతంగా పెట్టగా అతడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఓరాత్రి తనిఖీలు చేయగా కోదాడలో ఆరుగురు యువకులతో పాటు కొంత మేర గంజాయి పట్టుబడింది. స్థానిక పోలీసులు ప్రతిరోజు తనిఖీలు చేపడితే భారీగా గంజాయితో పాటు తాగే వారు పట్టుబడే అవకాశాలు లేకపోలేదని పట్టణవాసులు అంటున్నారు.

కోదాడ కేంద్రంగా రవాణా..

కోదాడ పట్టణం కేంద్రంగా గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని ఎప్పటి నుంచో పట్టణంలో చర్చనడుస్తుంది. ఈ గంజాయికి అలవాటుపడి తాగుతూ ఇప్పటి వరకు 50మందికి పైగా యువకులు పట్టుబడ్డారు.

పలు ప్రాంతాలను అడ్డాలుగా చేసుకొని..

పట్టణంలోని పలు శివారు ప్రాంతాల్లో గంజాయి తాగేందుకు యువకులు రాత్రి సమయంలో స్థావరాలను ఏర్పర్చుకొని గుట్టుచప్పుడు కాకుండా ఈ పనికానిస్తున్నారు. పట్టణంలోని అనంతగిరి రోడ్డులోని చెరువుకట్టపై, కొమరబండ శివారులోని బొబ్బలమ్మగుట్ట, కట్టకమ్ముగూడెం రోడ్డులోని బైపాస్ గ్రౌండ్ శివారు, కొమరబండ బైపాస్ నుంచి శ్రీరంగాపురం వరకు ఉన్న బైపాస్‌రోడ్డు వెంట రాత్రి సమయంలో ఈ గంజాయిని సిగరేట్లలోకి చేర్చి తాగుతున్నారు.

సరిహద్దులో నిఘా లేకపోవడంతోనే..

రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్ చెక్‌పోస్ట్, అన్నారం, పులిచింతల ప్రాంతాల వద్ద ఉన్న చెక్‌పోస్టుల్లో పటిష్టమైన నిఘా లేకపోవడంతోనే గంజాయి ఒడిశా, ఏపీ నుంచి తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టుల్లో ప్రతి వాహనాన్ని తనిఖీలు చేస్తే ఈ గంజాయి రవాణాకు అడ్డుపడే అవకాశం ఉంది.

గంజాయితో పట్టుబడితే కఠిన చర్యలు



కోదాడ పట్టణంలో గంజాయి నిర్మూలనకు తనిఖీలు ముమ్మరం చేశాం. ఇప్పటికే పలు కేసులు నమోదు చేసి అవగాహన కల్పించాం. యువత, విద్యార్థులు గంజాయికి అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు. గంజాయి గురించి ఎలాంటి సమాచారం అందినా ప్రజలకు తమకు తెలియజేసి సహకరించాలి. గంజాయితో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– టి.రాము, కోదాడ పట్టణ సీఐ

వ్యాపారంలో నైతిక విలువలు పాటించాలి



కార్యవర్గ ప్రమాణస్వీకారంలో మాట్లాడుతున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడఅర్బన్ : వర్తక, వాణిజ్య రంగంలో నైతిక విలువలు పాటించి ప్రజల మన్ననలు పొందాలని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీలరమేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వర్తక సంఘం భవనంలో ఆ సంఘం నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. వర్తక వాణిజ్య రంగాలలో కోదాడకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని వారు ఆకాంక్షించారు. వర్తక సంఘం అధ్యక్షుడిగా మేళ్లచెరువు కిషోర్, ప్రధాన కార్యదర్శిగా కొత్తూరు పూర్ణచందర్ రావు, కోశాధికారిగా కొత్త శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా బండారు వెంకటేశ్వర్లు, చల్లా విజయ్‌శేఖర్, కందిబండ శ్రీనివాసరావు, చిన్న బ్రహ్మం, వంగవీటి శేఖర్, సురేందర్‌కుమార్, జాయింట్ కార్యదర్శులుగా చీదేళ్ల సురేష్, సత్యనారాయణ, దుర్గారావు, రాధాకృష్ణ, సంతోష్, ఉపకోశాధికారిగా వెంకన్న ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, చైర్‌పర్సన్ ప్రమీలను సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, పైడిమర్రి సత్యబాబు, పారా సీతయ్య, యాదా రమేష్, మేకల శ్రీనివాసరావు, ఎం.ముత్యాలు, రాయపూడి వెంకటనారాయణ, గాదంశెట్టి శ్రీనివాసరావు, పైడిమర్రి వెంకటనారాయణ, కొత్త వెంకటేశ్వర్లు, సామినేని రమేష్, వంగవీటి నాగరాజు పాల్గొన్నారు.

సభలను జయప్రదం చేయాలి

మేళ్లచెరువు : సూర్యాపేట పట్టణంలో మార్చి 10న నిర్వహించే బహుజన మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కేతేపల్లి శ్రీను, మల్లయ్య, శ్రీను, వెంకన్న, బాబు, శ్రీను, సరేందర్, ప్రభాకర్, రాజు పాల్గొన్నారు.

పరిశ్రమ నిర్మించొద్దని ఆందోళన



రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

హుజూర్‌నగర్ : చింతలపాలెం మండలంలోని దొండపాడు శివారులో ఇన్నోవేరా పరిశ్రమను నిర్మించొద్దని ఆ గ్రామస్తులు ఆదివారం గ్రామంలో ప్రధాన రహదారిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వకుండా మంత్రులు హడావుడిగా వచ్చి శంకుస్థాపన చేయడం ఏమిటని ప్రశ్నించారు. 2019లో నిర్మించాలనుకున్న ఫార్మాసిటికల్ కంపెనీని ప్రజలు మూకుమ్మడిగా అడ్డుకున్నారని, త్వరలో అదే పరిస్థితి వస్తుందన్నారు. ఈ పరిశ్రమను గ్రామస్తులంతా కలిసి అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరావు, శ్రీను, గోపి, వెంకటేశ్వర్లు, వేణు, బాలాజీ, శేషు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి కల్యాణం



క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ పద్మసైదేశ్వరరావు

మేళ్లచెరువు : మండలంలోని కందిబండ గ్రామంలో శ్రీ భూనీళాసమేత శ్రీ చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను స్వర్ణాభరణాలు, పట్టువస్త్రాలు, పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల నడుమ కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

మండలంలోని కందిబండ గ్రామంలో శ్రీచెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు ఎంపీపీ కొట్టె పద్మ సైదేశ్వరరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గాయం గోపిరెడ్డి, సర్పంచ్ అబ్రహం, క్రీడాకారులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కె యాకూబ్

గరిడేపల్లి : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మంగాపురంలో పార్టీ మండల జనరల్‌బాడీ సమావేశం మాజీ సర్పంచ్ రాచమల్ల రామస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2016లో సమగ్ర సర్వే చేసి రాష్ట్ర వ్యాప్తంగా రూ.30లక్షల కుటుంబాలకు ఇంటి స్థలాలు లేవని నివేదిక ఇచ్చిందన్నారు. దాని ఆధారంగా ప్రతి కుటుంబానికి 120గజాల స్థలమిచ్చి ఎస్సీ, ఎస్టీలకు స్థలంతో పాటు రూ.6లక్షలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బూర చిన్న, ధరావత్ పంతులు, లాలు, నిర్మల, సైదమ్మ, లక్ష్మి, పద్మ, నాగయ్య, మంగయ్య, బీమ్లా పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి



విద్యార్థికి ప్రశంసపత్రం అందిస్తున్న సైకాలజిస్ట్ రాజశేఖర్

మేళ్లచెరువు : ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో పోటీ పరీక్షలు రాసి విజయం సాధించాలని సైకాలజిస్ట్ చారుగండ్ల రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని ఐడియల్ హైస్కూల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల్లో అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్.రమణకుమార్, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకుంటుంది



ఎండిన వరిపంటను పరిశీలిస్తున్న నాయకులు

మోతె : కాంగ్రెస్ ప్రభుత్వం పాలేరు రిజర్వాయర్ నుంచి మండలానికి సాగునీరు అందించి రైతులను ఆదుకుంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రాంపురంతండాలో ఎండిన వరి పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి సహకారంతో రానున్న రోజులో మండలానికి పాలేరు రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించేందుకు రూ.450కోట్లతో లిఫ్ట ఏర్పాటు చేసేందుకు సర్వే చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ కోఆర్డినేటర్ మదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రాములునాయక్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి



పాఠశాలలో తల్లిదండ్రుల పాదాలు కడుగుతున్న విద్యార్థులు

చిలుకూరు : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్లోబస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాద సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఉపేందర్, ఉపాధ్యాయులు, తలిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం

కోదాడరూరల్ : మండలంలోని ఎర్రవరం తాజా మాజీ సర్పంచ్ వీరేపల్లి సుబ్బారావును ఆదివారం మండల ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సుబ్బారావును ఆదర్శంగా తీసుకొని గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం ఆయనను పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మండలపు కృష్ణకుమారిశేషు, గ్రామపెద్దలు, నాయకులు ఉన్నారు.

వ్యాయామ అధ్యాపకులకు ..

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన కలకొండ సృజన్‌కుమార్ శ్యామల దంపతులు ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో వ్యాయామ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. దీంతో వారిని ఆదివారం మండల కేంద్రంలో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు పందిటి నవీన్‌కుమార్, దున్నా నాగరాజు, దున్నా వంశీ, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో నగదు చోరీ

హుజూర్‌నగర్‌రూరల్ : ఓ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు నగదును చోరీ చేశారు. ఈ ఘటన మండలంలోని బూరుగడ్డలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితురాలు వట్టికూటి మమత తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మమత తన భర్త రాంబాబుకు 5రోజుల క్రితం పక్షవాతం రావడంతో ఖమ్మంలోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లింది. 5రోజుల చికిత్స అనంతరం ఆదివారం ఇంటికి రావడంతో ఇంటి తాళం తీసి ఉంది. గమనించిన మమత ఇంట్లోకి వెళ్లి చూడగా ఓ సెల్ఫ్‌లో దాచిఉంచిన రూ.13లక్షలు చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్ఐ ముత్తయ్య ఇంటిని పరిశీలించి క్లూస్ టీంతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కనుల పండువగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం అర్ధరాత్రి శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా తొలుత ఎదుర్కోళ్లు నిర్వహించి కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన 3వేల మంది భక్తులు హాజరై వీక్షించినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు కందాళ శ్రీనివాసాచార్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలు పలువురిని ఆకర్షించాయి. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు



ముస్తాబైన శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం

నడిగూడెం : మండలంలోని వల్లాపురం రెవెన్యూ గ్రామపరిధిలో గల శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద జీవధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలను నేటి నుంచి నిర్వహించనున్నారు. అందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ మహోత్సవాలు సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేశారు. 26న ఆలయానికి, యాగశాలకు మంగళతోరణం కట్టుట, గోపూజ, గణపతి పూజ, 27న సుప్రభాతసేవ, ఆవాహిత దేవతాపూజ, వేదపారాయణ, జలాధివాసము, పంచగవ్య, 28న యంత్ర ప్రతిష్ఠ, జీవ ధ్వజ ప్రతిష్ఠ, పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్నదానం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సుజాత

గరిడేపల్లి : గ్రామాల్లో మౌలిక వసతుల రూపకల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మండలంలో ప్రజలకు అవసరమైన కనీస వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ పైడిమర్రి రంగనాథ్, పెండెం ముత్యాలు, గట్టికొప్పుల లక్ష్మారెడ్డి, మేకపోతుల అఖిల్, మామిడి బాస్కర్, గుండు సైదులు, కొలిపాక వెంకన్న, మేకపోతుల నాగయ్య, పెండెం రమేష్‌గౌడ్, సతీష్‌గౌడ్, కాశయ్య, బండ వెంకట్‌రెడ్డి, సీతారాంరెడ్డి, మేకపోతుల కొండలు, పిట్ట సైదులు, ఉడుముల నవీన్, మచ్చ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని ఫణిగిరి గుట్టుపై గల స్వయం వ్యక్త శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని పూజారులు ఆదివారం తెల్లవారుజామున అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రస్వామి, సీతమ్మ వార్లను పట్టు వస్త్రాలతో, పూలమాలలతో అందంగా అలంకరించి గుట్టు కింద ఉన్న కల్యాణ మండపానికి మేళతాళాలు, జయజయధ్వానాలతో తీసుకొచ్చారు. స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించిన అనంతరం విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, కంకణ ధారణ చేశారు. పూజారులు వేదమంత్రోచ్ఛరణల మధ్య ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, పుర ప్రముఖులు, అర్చకులు, స్థానాచార్యులు, దేవాలయ అభివృద్ధి సమితి సభ్యులు, భక్తులు, అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

కల్యాణోత్సవాలను పురస్కరించుకుని గుట్ట వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు పలువురిని విశేషంగా ఆకర్షించాయి. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీ కాకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌కుమార్

నేరేడుచర్ల : బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన ప్రశ్న ప్రతాల లీకేజీలు పునరావృతం కాకుండా చూడాలని బీఎస్పీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే పార్లమెంట్, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో ఓటర్లు ప్రస్తుతం 2లక్షల 50వేల 249 మంది ఉన్నారని అన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా జిలకర రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా నందిగామ గోవింద్, ఉపాధ్యక్షుడిగా అమరవరపు వెంకటేష్, కోశాధికారిగా మేరీ, కార్యదర్శులుగా నాగార్జున, సతీష్, బీవీఎఫ్ కన్వీనర్‌గా పోలే వెంకటేశ్వర్లు, మహిళా కన్వీనర్‌గా కృష్ణవేణిని ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్టాలిన్ అంబేద్కర్, మహిళా జిల్లా కన్వీనర్ నాగమణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉపేందర్, నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేష్‌బాబు, విజయ్, శ్రీనివాస్, సాల్మన్‌రాజు తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1979–80లో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆ నాటి జ్ఞాపకాలు నేమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఎన్.సైదిరెడ్డి, లక్ష్మి, సీహెచ్ సైదిరెడ్డి వసంత్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, శ్రీను, ఈశ్వరీ, వసంత, శ్రీను తదితరులున్నారు.

సీఐటీయూలో అంగన్‌వాడీ కార్యకర్తల చేరిక

కోదాడఅర్బన్ : పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల్లో పనిచేస్తున్న పలువురు అంగన్‌వాడీలు సీఐటీయూలో చేరారు. అనంతరం సీఐటీయూ జిల్లా కోశాధికారి కోటగిరి వెంకటనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ రాధాకృష్ణ మాట్లాడారు. వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా ప్రేమలత, కార్యదర్శిగా రాధతో పాటు పదిమంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.ముత్యాలు, బుజ్జమ్మ, శాంతాబాయి, గంగ, ఉష, రాంబాయి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కోలాటం పోటీలు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కాంగ్రెస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో దేవాలయం ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించిన కోలాట పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.25వేల నగదు, ద్వితీయ బహుమతి రూ.20వేలు, తృతీయ బహుమతి రూ.18వేలు, చతుర్థ బహుమతి రూ.15వేలు, పంచమ బహుమతిగా రూ.12వేలు, ఆరోబహుమతిగా రూ.10వేలు, ఏడో బహుమతి రూ.8వేలు, ఎనిమిదో బహుమతి రూ.6వేలు నగదును నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కాలె సామియేలు, ఎంపీటీసీ గడ్డం ఆదిలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు గడ్డం చంద్రారెడ్డి, ఓరుగంటి రవి, బోళ్ల రంగారెడ్డి, రెబబోతు వీరారెడ్డి, బోనాల శ్రీధర్, చినవీరయ్య, వీరబాబు, కరుణాకర్‌రెడ్డి, శంకర్, శ్రీను, గోపి పాల్గొన్నారు.